కార్తిక మాసంలో శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ ప్రాంతీయాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కడపలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నవంబరు 4, 11, 18, 25 తేదీలు (సోమవారాలు)తో పాటు 15న పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. లంకమల, భైరవకోన, నారాయణస్వామి మఠం, సిద్ధేశ్వరమఠం, బి.మఠం పెంచలకోన, శ్రీకాళహస్తి, మహానంది, ఓంకారం, శ్రీశైలం, నాయినాపల్లకోనం, అగస్తీశ్వరకోన, పొలతల, నిత్యపూజకోన, అల్లాడుపల్లె దేవళాలు, పుష్పగిరి, కాణిపాకం, కన్యతీర్థం, భానుకోట తదితర శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతామని చెప్పారు. దీపావళి సందర్భంగా 32 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30వ తేదీ ఒక్క బెంగళూరు నుంచే 30 ప్రత్యేక బస్సులు, చెన్నై నుంచి రెండు బస్సులు నడపనున్నామన్నారు. తిరుగు ప్రయాణానికి నవంబరు 3న బెంగళూరుకు 20 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన వెల్లడించారు.

కందిపప్పు వస్తోంది!



- చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు
- పౌరసరఫరాలశాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు

–న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఆర్థికంగా ఊరటనిచ్చేవిధంగా ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ విపణిలో కంది పప్పు ధరలు నింగిని తాకుతున్నాయి. కొనుగోలు చేయాలంటే వామ్మో అంటూ అదిరి పడుతున్నారు. పేదింట పప్పన్నం కరవు తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అందరికీ పంపిణీ చేయాలని ఆదేశించింది. లబ్ధిదారులు బియ్యం వద్దనుకుంటే జొన్నలను 1 నుంచి 3 కిలోల వరకు ప్రత్యామ్నాయంగా అందజేయాలని ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ అధికారులు సేకరణపై దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లోని గోదాంలకు సరఫరా చేస్తున్నారు.


ఉచితంగా ఇవ్వనున్న జొన్నలు

- జిల్లాకు 520 మెట్రిక్ టన్నుల కందిపప్పు సరఫరా చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని గోదాంలకు సరఫరా చేస్తున్నారు. డబ్బులు చెల్లించిన రేషన్‌డిపో డీలర్లకు కేటాయించాలని ఉత్తర్వులిచ్చింది. బియ్యం కార్డులున్నవారికి కిలో రూ.67లకు అందించనున్నారు. ఉచితంగా ఇస్తున్న బియ్యానికి బదులు జొన్నలను లబ్ధిదారుల ఇచ్ఛికం మేరకు 1 నుంచి 3 కిలోల వరకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాకు 720 మెట్రిక్ టన్నుల జొన్నలు తెప్పించారు. జొన్నలు కావాలనా, బియ్యం తీసుకోవాలనా అనేది లబ్ధిదారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.
- జిల్లాలో బియ్యం, అంత్యోదయ కార్డులు 5,86,352 ఉన్నాయి. లబ్ధిదారులు 17,62,579 మంది ఉన్నారు. వీరందరికీ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరకులు అందజేయడానికి చౌక ధరల దుకాణాలు 1,279 పనిచేస్తున్నాయి. బహిరంగ విపణిలో రకాన్ని బట్టి కందిపప్పు కిలో రూ.165 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాలు కొనుగోలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క మొన్నటి వరకు గత వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఏ నెలలో కూడా సక్రమంగా పంపిణీ చేసిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రత్యేకంగా దృష్టిసారించింది. సరకులు సరఫరా చేసే గుత్తేదారులకు బకాయిలు చెల్లించడానికి ముందుకొచ్చింది. వచ్చే నెల నుంచి సరకులు తీసుకునే వారందరికీ అందించాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలందాయి.

కోటా ప్రకారం కందిపప్పు

జిల్లాలో రేషన్‌కార్డులు ఉన్న లబ్ధిదారులకు కోటా ప్రకారం కంది పప్పు తెప్పించి సరఫరా చేస్తున్నాం. ఈసారి ఎలాంటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. అదేవిధంగా ఒక్కో కార్డుదారు బియ్యానికి బదులు జొన్నలు 1-3 కిలోలు ఉచితంగా ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. **- అర్జున్‌రావు, డీఎం**

మత్తులో కుర్రాళ్లు... కన్నవారికి కన్నీళ్లు!



బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన యువకులు నేరాలబాట పడుతున్నారు. చదువుకునే వయసులో కత్తులు దూస్తున్నారు. పెద్దల అడుగుజాడల్లో నడుస్తూ మంచి చెడులను తెలుసుకోవాల్సిన వారు తప్పటడుగులు వేస్తున్నారు. చెడు అలవాట్లకు బానిసలుగా మారి పోలీస్‌స్టేషన్, జైళ్ల మెట్లు ఎక్కుతున్నారు. ఇటీవల జరిగిన నేరాలు, ఘటనలు చాలా వరకు యువతకు సంబంధించినవే కావడం గమనార్హం.

–ఈనాడు, కడప

యువత మత్తు పంజరంలో చిక్కుకుని విలవిలలాడుతోంది. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి తల్లిదండ్రులకు తీరని వ్యథ మిగుల్చుతోంది. ప్రభుత్వాలు, పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా చాపకింద నీరులా గంజాయి, మత్తు పదార్థాల మాఫియా విస్తరిస్తూ ఎన్నో అనర్థాలకు కారణమవుతోంది. మత్తులో విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతోంది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు కోకొల్లలుగా చోటుచేసుకుంటున్నాయి.

- ఇటీవల బద్వేలు పట్టణంలో ఇంటర్మీడియట్ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పంటించి ఆమె మృతికి కారణమైన యువకుడు విఘ్నేష్ గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు చెబుతున్నారు. చెడు అలవాట్లతో బాలికను చంపేయడంతోపాటు తాను కటకటాలపాలయ్యాడు. ఫలితంగా రెండు కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోయాయి. విఘ్నేష్ భార్య గర్భవతి కావడంతో ఆమె భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది.
- కడప నగరంలో గంజాయి బాధిత కుటుంబసభ్యులు తమ గోడును వెళ్లబోసుకుంటూ కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులను తరచూ కలుస్తున్నారు. తమ కుటుంబాలను నిలబెట్టాలని వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తన భర్త, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితోపాటు బాధిత కుటుంబాలను వెంటబెట్టుకుని గురువారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిశారు. కడప నగరంలో గంజాయి, మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నట్లు ఫిర్యాదు చేశారు. యువకులు మందుల దుకాణాల్లో మత్తుకు ఉపయోగపడే ఔషధాలు కొనుగోలు చేసి ఇంజెక్షన్ల ద్వారా మత్తు ఎక్కించుకుంటున్నట్లు వివరించారు. మత్తుకు బానిసైన తమ పిల్లలు తమపైనే దాడులకు పాల్పడుతున్నారని బాధిత తల్లిదండ్రులు ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో గంజాయి, మత్తు పదార్థాలను వైకాపా ప్రభుత్వం పెంచి పోషించిందని, ఆ మూలాలు ఇంకా పోలేదని వారు వివరించారు.
- తెదేపా కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై ఈ నెల 19న దాడికి పాల్పడినవారిలో నలుగురు యువకులే ఉన్నారు. ప్రధాన నిందితుడు బాలిశెట్టి రవితేజతోపాటు రౌడీషీటర్ దీపక్, షేక్ మహమ్మద్ ఇంతియాజ్, షేక్ సమీర్‌లు నేరంలో భాగస్వాములయ్యారు. వీరితో పాటు నిందితుడిగా బాలుడు ఉండడం విశేషం. స్వల్ప కాలంలో జరిగిన నేరాలు, ఘటనల్లో అందరూ యువకులే పాత్రధారులు కావడం గమనార్హం.
- పీలేరుకు చెందిన ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు రెండు రోజుల కిందట గంజాయికి బలైపోయారు. కె.డి.నగర్‌కు చెందిన కిరణ్‌కుమార్, పద్మావతినగర్ వాసి యాసిన్ కొంత కాలంగా గంజాయికి బానిసలయ్యారు. వీరు పట్టణంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి గంజాయి తాగుతూ పట్టాలపై పడుకున్నారు. ఇదే సమయంలో నాగర్‌కోయిల్ నుంచి ముంబయి వెళుతున్న రైలు ఢీకొనడంతో దుర్మరణం చెందారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు ప్రాణాలు పోగొట్టుకుని తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చారు.

డ్రోన్లతో భరతం పడతాం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి భరతం పట్టడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లను వినియోగిస్తాం. ఈ మేరకు ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. గంజాయి, మందుల దుకాణాల్లో మత్తు పదార్థాలు విక్రయించే వారిపై నిఘా పెట్టాం. గోదాంలలో తనిఖీలు చేపడతాం.

-హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ



7 కిలోమీటర్లు... 100కు పైగా గోతులు

ప్రొద్దుటూరు మండలం లింగాపురం-కల్లూరు రహదారి గోతులమయంగా మారింది. సుమారు ఏడు కిలోమీటర్ల రహదారిలో సుమారు వందకుపైగా గుంతలున్నాయి. గోతుల్లో వర్షపునీరు చేరడంతో అవి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో 15 నిమిషాలు పట్టే ప్రయాణం ప్రస్తుతం 30 నిమిషాలు పడుతోందని, వాహనాలు సైతం దెబ్బతినడంతోపాటు ఒళ్లు హూనమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రహదారులు, భవనాలశాఖ డీఈ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం**

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పెంపు

జిల్లా సచివాలయం : డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును ఈ నెల 27 వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సరస్వతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ ఇచ్చే సంస్థలు, అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సామాన్యులకు న్యాయం జరిగేలా చర్యలు: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు స్టేషన్లకు వచ్చే సామాన్యులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మత్తు కలిగించే ఔషధాలపై నిఘా ఉంచాలని, అక్రమంగా విక్రయించే వారిపై దాడులు చేయాలని ఆయన ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల డ్రోన్లను ఉపయోగిస్తామని, ముమ్మరంగా దాడులు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రౌడీషీటర్లతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా విద్యార్థులకు పోలీసుల విధులు, దర్యాప్తు విధానం, తదితర వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ ప్రకాష్‌బాబు, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, సీఐలు, ఎస్.ఐ.లు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ


కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఈనాడు'లో శుక్రవారం 'అద్దె బస్సు.. భద్రత తుస్సు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆర్‌ఎం స్పందించారు. ఈ నేపథ్యంలో తరచూ ప్రమాదాలు చేస్తున్న ఆర్టీసీ, అద్దె బస్సు డ్రైవర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థపై నమ్మకంతో ప్రయాణికులు బస్సులు ఎక్కుతారని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బస్సులను ఏకాగ్రతతో నడపాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కియోస్క్... సేవలందక మూలకు!

- సాంకేతిక లోపాలతో మొరాయింపు
- అన్నదాతలకు తప్పని ఇబ్బందులు
- ఆర్ఎస్‌కేల్లో దిష్టిబొమ్మల్లా దర్శనం

విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా నిలబడాలని సదాశయంతో గత వైకాపా ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు (తాజాగా ఎన్డీయే ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది) ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అవసరమైన రైతులు వచ్చి సిబ్బందికి ముందస్తుగా నగదు చెల్లించాలి. అక్కడ కియోస్క్ యంత్రం ద్వారా ఆన్ లైన్‌లో నమోదు చేస్తే ఆ తరువాత ఎవరికీ ఏ రకం కావాలో తెప్పించే పరిస్థితి ఉండేది. కేంద్రాల్లో అందుబాటులో లేని అంతర్జాలం వసతి, సాంకేతిక లోపాలతో చాలాచోట్ల యంత్రాలు పనిచేయడం లేదు. దిష్టిబొమ్మల్లా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా అన్నదాతలకు సేవలందడంలేదు.

–న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం, గ్రామీణ


ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం రైతు సేవా కేంద్రంలో కొన్ని నెలలుగా పనిచేయని కియోస్క్ యంత్రం

వైఎస్ఆర్ జిల్లాలో 432, అన్నమయ్య జిల్లాలో 400 చోట్ల రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కేలు) ఏర్పాటు చేశారు. గత వైకాపా పాలనలో 2020, మే 30న సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. తొలుత ప్రభుత్వ భవనాలు లేని ప్రాంతాల్లో ప్రైవేటు గదులను అద్దెకు తీసుకొని నిర్వహించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలందాయి. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సొంత భవనాలు నిర్మించడానికి అనుమతిచ్చారు. ఒక్కో భవన నిర్మాణానికి తొలుత రూ.17.50 లక్షలు మంజూరు చేశారు. అనంతరం రూ.21.80 లక్షలకు అంచనా పెంచారు. ప్రతి కేంద్రానికి అప్పట్లో కియోస్క్ యంత్ర పరికరాన్ని ఇచ్చారు. ఒక్కోదాని ఖరీదు రూ.80 వేలు నుంచి రూ.90 వేలు వరకు ఉంటుంది. వీటి కోసం రెండు జిల్లాల్లో కలిపి సుమారు రూ.6.65 కోట్లు వెచ్చించారు.

- ఖరీఫ్, రబీలలో కర్షకులు పంటల సాగుకు అవసరమైన విత్తనాలు కావాలంటే ఆర్‌బీకేలకు వచ్చి పేర్లు నమోదు చేసుకుని తన వాటా చెల్లిస్తే తర్వాత తెప్పిస్తున్నారు. ఎరువులకు కూడా ఇదే విధానం అమలవుతోంది. పైర్లను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు సమగ్ర సస్యరక్షణ కోసం పురుగుమందులు పిచికారీ చేయాలి. కాకపోతే వీటిని మాత్రం చాలాచోట్ల విక్రయించలేదు. సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. నాటి సీఎం జగన్ ఏలుబడిలో మరమ్మతులు చేయకుండా వదిలేశారు. బాగు మాటను విస్మరించి పక్కన పెట్టేడయంతో విలువైన యంత్రాలు అక్కరకు రావడం లేదు. మరోవైపు అంతర్జాలం వసతి కూడా అన్నిచోట్ల అందుబాటులో లేదు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది పలుమార్లు ఏవో, ఏడీఏల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. తమ వద్ద ఉన్న చరవాణితో యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.
- ఒంటిమిట్ట మండలం ఒంటిమిట్ట, నర్వకాటిపల్లె, కొత్త మాధవరం, పెన్న పేరూరు, గంగపేరూరు, రాచగుడిపల్లె, సాలాబాదు, మంటపంపల్లె, చింతరాజుపల్లె కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు పనిచేయకుండా మొరాయిస్తున్నాయి.
- రాజంపేట మండలం మందరం, తాళ్లపాక, మదనగోపాలపురం, పులపుత్తూరులోనూ పనిచేయడం లేదు. ఇక్కడే కాకుండా రెండు జిల్లాల్లోనూ చాలాచోట్ల ఇదే దుస్థితి నెలకొంది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కియోస్క్ యంత్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

కొన్నిచోట్ల పనిచేయడం లేదు

రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు కొన్నిచోట్ల పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. కర్షకులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వివరాలను ఆర్ఎస్‌కే బాధ్యుల చరవాణిలో నమోదు చేయిస్తున్నాం. ఎక్కడైతే వినియోగంలో లేవో క్షేత్రస్థాయి నుంచి సమాచారం సేకరిస్తాం. మరమ్మతులు చేయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బాగు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

- నాగేశ్వరరావు, చంద్రానాయక్, డీఏవోలు, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలు

పెళ్లయిన అయిదు నెలలకే మృత్యుఒడికి..

నవ వరుడి ఆయువు తీసిన కేబుల్ గుంత



కలసపాడు, న్యూస్‌టుడే: వివాహమైన అయిదు నెలలకే నవ వరుడిని కేబుల్ గుంత రూపంలో మృత్యువు కబళించింది. ఈ దుర్ఘటన మండల కేంద్రంలోని గిద్దలూరు ప్రధాన రహదారిలోని పిడుగుపల్లె వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్లారెడ్డిపల్లెకు చెందిన **గుడిమె గురయ్య** (27) బద్వేలులోని సెంచరీ ప్లేవుడ్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. గత ఏప్రిల్ నెలలో పోరుమామిళ్ల మండలం కవలకుంట్లకు చెందిన యువతితో వివాహమైంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విధులకు వెళ్లి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా పిడుగుపల్లె వద్ద టెలిఫోన్ కేబుల్ కోసం తవ్విన గుంత వద్ద మట్టి కుప్పల వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెళ్లయిన కొంతకాలానికే మృతి చెందడంతో ఆయన భార్య, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

అక్రమాల ఆట!

ఇష్టానుసారంగా ఎస్‌జీఎఫ్ ఎంపికలు


క్రికెట్ ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

–న్యూస్‌టుడే, కడప క్రీడలు

ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా జట్ల ఎంపికల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. అనర్హులకు చోటు కల్పించడంతో ఎంతో నైపుణ్యం గల క్రీడాకారులు జిల్లా స్థాయిలోనే చతికిలబడిపోతున్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడలు విద్యార్థులకే కాకుండా వ్యాయామోపాధ్యాయులకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైనవి. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న ఎంపికలన్నీ దారి తప్పుతున్నాయి.

ఒకరిద్దరి ఆధ్వర్యంలోనే : ప్రతి పాఠశాల నుంచి క్రీడాకారులు పాల్గొనేవిధంగా ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించాలి. ముఖ్యంగా జిల్లా స్థాయి పోటీలు క్రీడాకారులతోపాటు పీఈటీ, పీడీలకు ఎంతో ముఖ్యమైనవి. ఒక్కో క్రీడకు ఒక్కో కమిటీని ఏర్పాటు చేసి డీఈవో అనుమతి తీసుకోవాలి. ఇలా చేయకుండా, ఒకరిద్దరు వ్యాయామోపాధ్యాయులతోనే తూతూమంత్రంగా నిర్వహించి, తాము అనుకున్నవారికి జట్టులో చోటు కల్పిస్తున్నారు. గతంలో ఎంపికలు విద్యాశాఖాధికారితో పాటు జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరిగేవి. ప్రస్తుతం వారు పట్టించుకోవడం లేదు.

ఒకే అకాడమీ నుంచి 17 మంది ఎంపిక : ఈ నెల 22న కడప నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికల్లో తమకు అన్యాయం జరిగిందని ప్రొద్దుటూరు, మైదుకూరుకు చెందిన క్రీడాకారులు, శిక్షకులు వాపోతున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన ఒక క్రికెట్ అకాడమీ నుంచి ఏకంగా 17 మందిని ఎంపిక చేయడం అక్రమాలకు ఉదాహరణ అని వారు పేర్కొంటున్నారు. ఇవే కాకుండా మిగిలిన క్రీడాపోటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

కార్యదర్శి కుమారుడిదే హవా...

ప్రస్తుత జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.అరుణకుమారి తమకు ఇష్టం వచ్చిన రీతిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వ్యాయామోపాధ్యాయులు వాపోతున్నారు. ముఖ్యమైన క్రీడల పోటీలను ఆమె కుమారుడు ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో అర్హులను అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జట్టు ఎంపికలో కార్యదర్శి కుమారుడు (వృత్తంలో)

పారదర్శకత పాటించడం లేదు


ఎంపికలో పారదర్శకత పాటించడం లేదు. ఎన్నో ఏళ్లుగా శిక్షణ తీసుకున్న క్రీడాకారులను కాదని, వారికి ఇష్టమొచ్చినట్లు జట్టును ఎంపిక చేశారు. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో మంచి ప్రదర్శన చేసినా చోటు దక్కలేదు. దీంతో ప్రతిభ గలవారు నష్టపోతున్నారు.

- సురేష్, వెంకట్, శిక్షకులు

పర్యవేక్షిస్తున్నాం

జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీ ప్రతినిధులు కొందరు గైర్హాజరు కావడంతో వేరే వారికి బాధ్యత అప్పగించాం. జిల్లా నుంచి నాణ్యమైన జట్లను ఎంపిక చేస్తాం.

- బి.అరుణకుమారి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి


రైతులతో మాట్లాడుతున్న డీఏవో నాగేశ్వరరావు

త్వరలో ధాన్యం కొనుగోళ్లు : డీఏవో

వేంపల్లె, న్యూస్‌టుడే : జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని త్వరలో కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె ప్రాంతాల్లో సాగుచేసిన వరిపంటను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం రైతు సేవాకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనను కలిసి ధాన్యాన్ని బయట వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారని, దీంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ త్వరలో ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయనవెంట ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏవో రాజేంద్రప్రసాద్, తదితరులున్నారు.

వరద బాధితులకు రూ.5.55 లక్షల విరాళం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: గత నెల వర్షాలకు సర్వం కోల్పోయిన విజయవాడ వరద బాధితులకు రూ.5,55,555 విరాళాన్ని ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన అరబిందో ఇంటిగ్రల్ పాఠశాల ప్రెసిడెంట్ వంకధార వీరభద్రయ్య, కరస్పాండెంట్ కాశిప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే వరదరాజులురెడ్డికి అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో ప్రభుత్వానికి పంపుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం సంయుక్తంగా బాధిత కుటుంబాలకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విజయవాడ వరద బాధితులకు రూ.5.55 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే వరదరాజులురెడ్డికి అందజేస్తున్న అరబిందో ఇంటిగ్రల్ పాఠశాల ప్రెసిడెంట్ వంకధార వీరభద్రయ్య, కరస్పాండెంట్ కాశిప్రసాద్‌రెడ్డి

బిల్లులు చెల్లించలేదని భోజనం పెట్టని వార్డెన్

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక సీఎస్ఐ క్యాంప్‌బెల్ ఆసుపత్రి ఆవరణలో అనుబంధ విద్యా సంస్థగా కొనసాగుతున్న డాక్టర్ హెలెన్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థినులు ఆకలితో అల్లాడిపోయారు. మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని హాస్టల్ వార్డెన్ గురువారం మధ్యాహ్నం, రాత్రి భోజనం ఇవ్వలేదు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నర్సింగ్ కోర్సు చేస్తున్న విద్యార్థుల్లో కొందరు మాత్రమే మెస్ బిల్లులు చెల్లించారు. మిగిలిన వారికి నవంబరు పదో తేదీ వరకు గడువిచ్చారు. బిల్లులు చెల్లించని విద్యార్థినులకు గురువారం మధ్యాహ్నం, రాత్రి భోజనం అందకపోవడంతో బాధిత విద్యార్థినులు అర్ధరాత్రి నిరసన తెలిపారు. దీంతో పట్టణ ఎస్ఐ రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తదితరులు వెళ్లి బాధితులతో మాట్లాడారు. ఈ విషయాన్ని కరస్పాండెంట్ డాక్టర్ అగస్టీన్‌రాజ్‌కు చేరవేయగా ఆయన వచ్చి విద్యార్థినులకు భోజనాన్ని అందజేశారు. శుక్రవారం విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున హాజరై యాజమాన్యంతో మాట్లాడారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో సాయిశ్రీ వచ్చి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బిల్లులు చెల్లించలేదని రెండు పూటలా పస్తులు ఉంచడం సబబుకాదని స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీ కరస్పాండెంట్ అగస్టీన్ రాజ్ మాట్లాడుతూ గురువారం రాత్రి జరిగిన ఘటన బాధాకరమన్నారు. బకాయిలు ఉన్నవారు భోజనం చేయకూడదని వార్డెన్ చెప్పడంతో అమ్మాయిలు నొచ్చుకున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. బాధ్యులైన వార్డెన్‌కు షోకాజు నోటీసులిచ్చామన్నారు.



విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఆర్డీవో సాయిశ్రీ

నగర పంచాయతీ మాజీ ఛైర్మన్ మృతికి సంతాపం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల నగర పంచాయతీ మాజీ ఛైర్మన్ హనుమనగుత్తి మునెయ్య (70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. నగర పంచాయతీ మారిన తరువాత ఆయన మొట్టమొదటి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

మైలవరానికి నీటి విడుదల

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం రిజర్వాయర్‌కు భారీగా నీటిని విడుదల చేశారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో గండికోట జలాశయంలోని నాలుగు గేట్ల ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని మైలవరం రిజర్వాయర్‌కు విడుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్ తెలిపారు. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు సుమారు 12 వేల క్యూసెక్కుల నీరు వస్తున్న నేపథ్యంలో జలాశయంలో నీటిమట్టం పెరగకుండా నీటిని మైలవరానికి పంపుతున్నట్లు వివరించారు.

ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి(జీవకోన), బద్వేలు, న్యూస్‌టుడే: టాస్క్‌ఫోర్స్ బలగాలు వైఎస్ఆర్ జిల్లా పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి తన సిబ్బందితో బద్వేల్ సమీపంలోని బ్రాహ్మణపల్లె వద్ద దాడులు చేయగా... ఎర్రచందనం తరలిస్తున్న స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేయడంతో ఒకరిని పట్టుకున్నారు. 14 దుంగలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

కాలువ ఇలా... పారేదెలా?



వేల ఎకరాలకు సాగునీరు అందించే కేసీ ప్రధానకాలువలో సులువుగా పెరిగే తీగజాతి మొక్క విస్తరిస్తోంది. నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. మైదుకూరులోని కేసీకాలువ బంగ్లా సమీపంలోని ప్రధానకాలువలో తీగజాతి మొక్క కనిపిస్తోంది. రోజులు గడిచేకొద్దీ అంతకంతకూ విస్తరించే ప్రమాదం ఉంది. ఎగువ నుంచి కొట్టుకుని వచ్చే వ్యర్థాలు తీగజాతి మొక్కకు అడ్డుకుంటున్నాయి. ఇక్కడే కాదు ప్రధానకాలువ పలుచోట్ల తీగజాతి మొక్క కనిపిస్తోంది. అధికారులు తొలగించకుంటే కాలువలో మరింతగా విస్తరించి సాగునీటి సరఫరాకు సమస్యగా మారనుంది. ఈ తంతు పట్ల అధికారులు దృష్టి సారించి కాలువలో తీగజాతి మొక్కను తొలగించాల్సిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మైదుకూరు

రక్తం పంచి... ఆయువు పెంచి

పలువురికి ప్రాణదానం

–న్యూస్‌టుడే, కొండాపురం, రాజుపాళెం



అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ చేతులమీదుగా అవార్డు పొందుతున్న ఆర్మీ మాజీ కమాండో హాజీవలి

రక్తదానం ప్రాణదానంతో సమానం. వివిధ అపోహల కారణంగా అత్యవసర సమయంలోనూ రక్తదానం చేసేందుకు చాలా మంది వెనుకాడుతున్నారు. బాధ్యత గుర్తించి ప్రాణదాతలుగా నిలిచేవారు కొద్దిమందే. అందులో యువతీ, యువకులు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం. ప్రస్తుతం రక్తం నిల్వల కొరత తీవ్రంగా వేధిస్తోంది. బ్లడ్ బ్యాంకులో సైతం నిల్వలు నిండుకోవడంతో అందరూ రక్తదాతల వైపు ఆశగా చూస్తున్నారు. సకాలంలో రక్తం అందక తలసేమియా చిన్నారులు, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరికి తామంతా అండగా ఉన్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. కొండాపురం గ్రామానికి చెందిన ఆర్మీ విశ్రాంత కమాండో హాజీవలి 'బ్లడ్ డోనర్స్ ఎమర్జెన్సీ 24×7' గ్రూపు ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో అవసరమైన వారికి ఉచితంగా రక్తదానాన్ని ఇవ్వడానికి యువకులతో పాటు మహిళలు సమానంగా మేము సైతం అంటూ రక్తదాన శిబిరాల్లో పాల్గొంటున్నారు.

జట్టుకట్టి ముందడుగు



నేను ఆర్మీలో పని చేస్తున్న సమయంలో అక్కడ ఓ ప్రమాదం జరిగి తోటి సైనికుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో నేను తొలిసారి రక్తదానం చేశాను. ఆర్మీ నుంచి పదవీ విరమణ అనంతరం స్వగ్రామంలో గ్రూపు ఏర్పాటు చేశాను. ఇప్పటి వరకు 83 సార్లు రక్తదానం చేశాను. కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, దిల్లీ, బెల్గం తదితర ప్రాంతాల్లోమా సభ్యులు అందుబాటులో ఉంటారు.

-హాజీవలి, గ్రూపు, వ్యవస్థాపకుడు, కొండాపురం

రక్తమిస్తేనే ఆరోగ్యం



నాది 'ఓ' నెగెటివ్ రక్తం. ఈ గ్రూపు రక్తం దొరకడం కష్టం కావడంతో నావంతు ప్రజలకు ఉపయోగపడాలని నిర్ణయించుకున్నాను. ఇప్పటి వరకు 11 సార్లు రక్తదానం చేశాను. రక్తదానం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటాం. దీన్ని అంతా గ్రహించాలి. అత్యవసర సమయాల్లో రక్తం లభించక చాలా మంది ప్రాణాలు కోల్పోవడం బాధేస్తోంది. రక్తదానం చేయడానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను. -రహీం, కొండాపురం

ప్రాణం కాపాడడం సదవకాశం



అత్యవసర సమయంలో సాటి మనిషిని కాపాడేందుకు మనకున్న అవకాశమిది. 'బి' పాజిటివ్ రక్తం. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతగా నిలుస్తున్నందుకు నాకు ఎంతో సంతృప్తి నిచ్చింది. అత్యవసర సమయంలో అవసరమైన వారికి రక్తదానం చేయడానికి సిద్ధం. మనవాళ్లకు అవసరమైనపుడు రక్తదాతల కోసం వెతికి.. అవతలి వారికి అవసరమైనపుడు తప్పించుకోవటం మంచిది కాదు. - గోరిశెట్టి రాధ, కొండాపురం

ఒకరిని కాపాడడంలోనే ఆనందం



రక్తం అవసరం అయిన వారికి అందించాలనే సభ్యురాలిగా చేరి రక్తదానం చేశాను. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారినీ రక్షించవచ్చు. ఒకరి ప్రాణం నిలబడుతున్నందుకు ఎంతో ఆనందాన్ని పొందవచ్చు. యువతతో పాటు మహిళలు కూడా కదలినప్పుడే రక్తనిల్వలు పెరుగుతాయి.

-షేక్.సమివున్నిసా బేగం, కొండాపురం

బ్యాడ్మింటన్ పోటీల్లో రాణింపు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రధానాచార్యులు జయరామిరెడ్డి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: బద్వేలులోని ఎస్.బి.వి.ఆర్ కళాశాలలో ఈనెల 24న జరిగిన యోగివేమన విశ్వవిద్యాలయ వార్షిక కాలేజీయేట్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని ప్రధానాచార్యులు జయరామిరెడ్డి తెలిపారు. ఉమెన్స్ డబుల్స్‌లో జయశ్రీ, వాణి, మానస మొదటి స్థానంలో నిలిచారన్నారు. ఉమెన్స్ సింగిల్స్‌లో నిరీష ద్వితీయ స్థానంలో రాణించారని తెలిపారు. మెన్స్ డబుల్స్‌లో గోపాల్, రవితేజ, వర్షిత్, తృతీయ స్థానం సాధించారన్నారు. చెన్నైలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు వర్షిత్ అనే విద్యార్థి ఎంపిక అయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

వ్యాధి ప్రబలకుండా చర్యలు

ముద్దనూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్వీగిరి కాలనీలో డెంగీ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఎంహెచ్‌వో ఉమామహేశ్వరావు మెడికల్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన కాలనీలో పర్యటించారు. అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్య తీరును, నీటితొట్లను పరిశీలించారు. మురికి నీరు నిల్వ ఉన్న కాలువలో ఆయిల్ బాల్స్‌ను వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులురెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి అక్షుమయ్య, డీఎంహెచ్‌వో కార్యలయ సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణంలో సాంకేతికత



హాజరైన పంచాయతీ రాజ్ ఎస్ఈ జి.వి.శ్రీనివాసరెడ్డి, ఈఈ శ్యామసుందర్‌రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ బీటీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను మెరుగుపర్చడంలో భాగంగా ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఎస్ఈ జి.వి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగులకు గ్రామీణ రోడ్ల నిర్మాణంలో ఆధునిక టెక్నాలజీ వినియోగంపై జియోసోల్ కంపెనీ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఆర్ ఈఈ శ్యామసుందర్‌రాజు, ఏఈలు, క్వాలిటీ కంట్రోల్ నిపుణులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోటీలు... విజ్ఞాన వేదికలు



పరీక్షకు పాల్గొన్న విద్యార్థులు


ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీ రవీంద్ర ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పి.లక్ష్మీదుర్గ (9వ తరగతి) ఎ.వి గీతిక (10 తరగతి), టి.రామ మోక్షిత (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ విష్ణుకుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌వల్లి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు విద్య



విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ విష్ణుకుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌వల్లి

పోటీల్లో విద్యార్థుల సత్తా



హాజరైన విద్యార్థులు

ప్రొద్దుటూరు పట్టణంలోని ఒలివియా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. అందులో ఎల్.సంజనరెడ్డి (10వ తరగతి), యస్.ఇమాంబి (9వ తరగతి), వై.గౌతమ్ (10 తరగతి) విజేతలుగా నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ వరకుమారి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు విద్య



విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ వరకుమారి

మెప్మా అర్బన్ మార్కెట్లో వస్తువుల విక్రయం

మైదుకూరు, న్యూస్‌టుడే : పొదుపు సంఘాలతో రుణం పొంది స్వయం ఉపాధి కల్పించుకున్న మైదుకూరు పురపాలకలోని మహిళలతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. కమిషనర్ ఎం.శ్రీనివాసులరెడ్డితో కలిసి పురపాలక ఛైర్మన్ మాచనూరు చంద్ర అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. సిటీ మిషన్ మేనేజర్ కెజియా జాస్లిన్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు వై.పి.పుల్లయ్య, పీవీ రమణమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చాలని వినతి

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కె.బొమ్మేపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జమ్మలమడుగు మండలం పొన్నతోటలో నిర్వహిస్తున్నారని తమ గ్రామాల్లోనే నిర్వహించాలని బొమ్మేపల్లె, దొరువుపల్లె గ్రామస్థులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ముద్దనూరు ఐసీడీఎస్ సీడీపీవో ముంతాజ్‌బేగం కె.బొమ్మేపల్లె కాలనీ సి-బ్లాక్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సుగుమంచిపల్లె ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని సి-బ్లాక్‌లో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

దెబ్బతిన్న ఉల్లి పంటల పరిశీలన

దువ్వూరు, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన వర్షం ధాటికి దెబ్బతిన్న కేపీ, పెద్దబళ్లారి రకం ఉల్లి పంటలను శుక్రవారం ఉద్యానశాఖ అధికారి సి.రామకృష్ణ పరిశీలించారు. నీలాపురం, మదిరేపల్లె, చిన్నశింగనపల్లె గ్రామాల్లో ఉల్లి పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన ఎరువులు, క్రిమిసంహారక మందులపై రైతులకు సూచనలు చేశారు. ఉద్యాన సహాయకులు జి.సమీర, గంగా ఈశ్వరి పాల్గొన్నారు.

దేశ సేవలో భాగస్వాములు కావాలి

కలసపాడు, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యార్థి దశనుంచే దేశ సేవలో భాగస్వాములు కావాలని ఎస్సై చిరంజీవి తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎస్కే, పీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'సైబర్ క్రైమ్' నివారణలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో సుమారు 17 ఏళ్లుగా పెండింగ్ సమస్యల పరిష్కారానికి నోచుకోలేదని ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్‌పాషాకు వినతిపత్రం అందజేశారు.

రసాయనిక ఎరువుల స్థానంలో ఘన జీవామృతం

మైదుకూరు, న్యూస్‌టుడే : పంటకు అందించే రసాయనిక ఎరువు స్థానంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా తయారు చేసే ఘన జీవామృతం వినియోగించాలని వనిపెంట కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎం.బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో ఘన జీవామృతం తయారీ, వినియోగించడంతో కలిగే లాభాలను వివరించారు. రైతులతో కలిసి ఘన జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ ఘన జీవామృతాన్ని పొడిగా చేసి వేప లేక కానుగ చెక్కతో కలిపి పంటకు వేయడంతో మొక్కకు కావాల్సిన పోషకాలు అందుతాయని భూస్థితి మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విద్యారాణి, ఎస్.ఫిరోజ్‌హుస్సేన్‌తో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఓబయ్య, ఆదినారాయణ, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పు ఆరోగ్యానికి మంచిది

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రజలందరూ అయోడిన్ ఉప్పును వాడాలని, ఇది ఆరోగ్యానికి చాలా మంచిదని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డి.హరిత సూచించారు. శుక్రవారం స్థానిక పట్టాభి రామ మండి మర్చంట్‌లో మండి అసోసియేషన్ ఆధ్వర్యంలో అయోడిన్ ఉప్పుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అయోడిన్ వాడటం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.రోషన్, కార్యదర్శి వి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయోడిన్ ఉప్పు పొట్లాన్ని చూపుతున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత

వైభవంగా ముగిసిన జెండా ఊరేగింపు



పెద్దముడియం, న్యూస్‌టుడే: జంగాలపల్లె గ్రామంలో రెండు రోజుల పాటుగా నిర్వహించిన దస్తగిరిస్వామి జెండా పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం జనసందోహం నడుమ వాయిద్యాలతో జెండా ఊరేగింపు చేపట్టారు. రంగు రంగుల కాగితాలతో తయారుచేసిన పూల చెట్టును ఎద్దుల బండిలో తీసుకెళ్లారు. సాయంత్రం జెండాలను దర్గాలో కూర్చోబెట్టి ముగింపు పలికారు.

32 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన వారికి నియామక పత్రాలందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన జాబ్ మేళాలో 32 మందికి ఉద్యోగాలు వచ్చాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు తెలిపారు. కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించామని చెప్పారు. 80 మంది యువత పాల్గొన్నారని తెలిపారు. కళాశాల జేకేసీ సమన్వయకర్త సులోచన, స్కిల్‌అప్ కోఆర్డినేటర్ వెంకట్రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై పురాధ్యక్షుడి ఆగ్రహం

బద్వేలు, న్యూస్‌టుడే: పురపాలిక కార్యాలయం ఆవరణలో శుక్రవారం సచివాలయ ఉద్యోగిపై పురపాలిక ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి అసభ్యకర వ్యాఖ్యలు చేశారని తెలిసింది. సహ ఉద్యోగుల ముందు శానిటేషన్ సెక్రటరీపై మండిపడి.. తనకు సంబంధించిన మనుషులు వస్తే ఎందుకు పనులు చేయవంటూ దుర్భాషలాడారని తెలిసింది. తన చేతిలో లేని పనిని తానెలా చేయగలనని ఆ ఉద్యోగి జవాబు ఇస్తుండగా కమిషనర్ నరసింహారెడ్డి జోక్యం చేసుకుని ఛైర్మన్‌కు సచివాలయ ఉద్యోగులకు సర్దిచెప్పినట్లు సమాచారం. ఛైర్మన్ తీరుపై సచివాలయ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ నరసింహారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి శానిటేషన్ సెక్రటరీని సాధారణంగా అడిగారని, అసభ్యకర వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఉద్యోగులతో మాట్లాడిన తర్వాత శానిటేషన్ సెక్రటరీది తప్పు లేదని ఛైర్మన్ తెలుసుకున్నారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు: 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ: 8008573493

?: ప్రొద్దుటూరు పురపాలక సంఘ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వీధిదీపాలు వెలగడం లేదు. సాయంత్రం వేళ మైదానంలో వాకింగ్ చేసే వారికి చీకటిగా ఉండడంతో విషసర్పాలతో ఆందోళనకు గురి అవుతున్నాం. వీధిదీపాలు వెలిగించేందుకు పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలి. -పెద్దపీరయ్య, స్థానికుడు

✓: వీధిదీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాను.
-దిల్‌షాద్, ఏఈ, పురపాలక ఇంజినీరు, ప్రొద్దుటూరు
-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

కేజీబీవీ బాలికలు... క్రీడల్లో విజేతలు

– న్యూస్‌టుడే, అట్లూరు

జాతీయస్థాయి పోటీల్లో సత్తా

గ్రామీణ ప్రాంత విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. చదువులతో పాటు ఆటల్లోనూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. అట్లూరు కస్తూర్బా విద్యార్థినులు క్రీడల్లో ప్రత్యర్థులపై తడాఖా చూపుతున్నారు. పోటీల్లో సత్తాచాటుతున్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ ప్రశంసలు పొందుతున్నారు. 270 మంది విద్యార్థులకు వంద మందికి పైగా క్రీడా పోటీలకు సై అంటున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల, ప్రిన్సిపల్ ఫణిశ్రీ ప్రోత్సాహంతో విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తున్నారు.



విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ ఫణిశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల

ఎస్పీ కావాలన్నదే లక్ష్యం



సొంతూరు గంగనపల్లి. మా నాన్న రైతు. టెట్ బాల్ క్రికెట్‌లో జాతీయ స్థాయిలో ఎంపికయ్యాను. రాష్ట్ర స్థాయిలో నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, కుస్తీ, జూడో, టెన్నిస్, కురాస్ క్రీడల్లో రాణించాను. ఎస్పీ కావాలన్నదే నా లక్ష్యం. చెన్నైలో మరిన్ని జట్లతో ఆడబోతున్నాం.

- ఎస్.మస్తాన్‌బీ, ఇంటర్

మహిళ క్రికెట్ జట్టులో చోటు సాధిస్తా



సోమశిల ముంపులో ఎగువపల్లె మా ఊరు. పునరావాసంలో అట్లూరు క్రాస్‌రోడ్డులో ఉంటున్నాం. ఇటీవల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రాణించాను, జాతీయ స్థాయిలోను ఆడేందుకు వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల అవకాశం కల్పిస్తున్నారు. ఇండియా మహిళా క్రికెట్ జట్టులో ఆడాలన్నదే లక్ష్యం. సెపక్‌తక్రా, కురాస్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణించాను.

- వై.సుప్రియ, ఇంటర్

అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని లక్ష్యం



కస్తూరిబాలో ఇంటర్ చదువుతున్నాను, ఇటీవల టెన్నిస్ బాల్ క్రికెట్‌లో మా జట్టు జాతీయ స్థాయిలో విజయం సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం. సాఫ్ట్‌బాల్, సెపక్‌తక్రా, బేస్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు కావాలన్నదే లక్ష్యం. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన క్రీడలు ఆడించాలన్నదే కోరిక.

- బి.లక్ష్మీప్రసన్న, ఇంటర్

నిర్మించినా నిరుపయోగమే!



ఓ వైపు ప్రభుత్వ కార్యాలయాలు, పరిపాలన నిర్వహణకు శాశ్వత భవనాలు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పెదముడియం సచివాలయ భవనం వినియోగంలో లేకపోవడంతో పాడుబడింది. పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం చొరవ చూపి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ శివ ప్రసాద్‌ను వివరణ కోరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. పరిసరాలను శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొండాపురం

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

'ఆస్తి కోసం తల్లీచెల్లిని దూరం చేసుకోవడం అవివేకం'

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆస్తులకోసం తల్లిని, చెల్లెని దూరంచేసుకోవడం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవివేకమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ విషయాలన్నీ వారి కుటుంబ వ్యవహారాలు కాగా... వాటిని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డి రచ్చకీడుస్తున్నారని ఆరోపించారు. తండ్రి ఆస్తిలో ఆడపిల్లకు వాటా వారి హక్కు అన్నారు. జగన్ కష్టం చేసి సంపాదించారని రాచమల్లు చెబుతున్నారని ఏం కష్టం చేసి సంపాదించారో ప్రజలకు తెలపాలన్నారు. తల్లి, చెల్లెకి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు అవసరం లేదన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలు గమనించాలన్నారు. శనివారం నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సుమారు నెల రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, పుర మాజీ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, నాయకులు ఈవీ సుధాకర్ రెడ్డి, చల్లా రాజ గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

నర్సుల సంఘ నాయకురాలికి సన్మానం



లిల్లీ ఫ్లోరెన్స్‌ను సత్కరిస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ప్రభుత్వ పెద్దాసుపత్రిలో హెడ్ నర్సుగా పని చేస్తున్న లిల్లీ ఫ్లోరెన్స్ ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘం కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్జీవో సభా భవనంలో ఆమెకు దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సంఘ అధ్యక్షుడు రామిరెడ్డి, ఏపీ ఎన్జీజీవో సంఘ నాయకులు సదాశివ, ప్రమీల, ప్రభంజనరెడ్డి, జయంతి, శివ నారాయణ, సంధ్యారాణి, రాజశేఖర్, ఏపీవీవీపీ సంఘ నాయకులు దేవమణి, వెంకటేశ్వర్లు, మహేశ్వరయ్య, ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పసిడిపురి... అపరిశుభ్రతగా మారి!

న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం



అధ్వానంగా పొట్టిపాడు రోడ్డు



వైఎంఆర్‌కాలనీలో పార్కు వద్ద పారని మురుగు

పసిడిపురిగా ప్రసిద్ధిచెందిన ప్రొద్దుటూరు పట్టణ వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ప్రధానంగా కాలువల్లో మురుగు ఎప్పటికప్పుడు పారకపోవడంతో ప్రజలు దుర్వాసనతో అల్లాడుతున్నారు. పర్యవసానంగా దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు నిర్మించినా కాలువలు ఆధునికీకరణకు నోచుకోలేదు. ఒకటో వార్డులో బొల్లవరం నుంచి దొరసానిపల్లె దారిలో తాగునీటి గొట్టాల కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. దర్గావీధిలో చెత్త సేకరణ అస్తవ్యస్తంగా మారింది. రెండో వార్డులోని పొట్టిపాడురోడ్డు పరిధిలో కాలువలు అధ్వానంగా మారాయి. వరద, మురుగు పారేందుకు అనుకూలంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షమొచ్చినా జలమయమవుతున్నాయి. వైఎస్‌నగర్‌లో సకాలంలో కాలువలను తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు. భారతీపేట వీధుల్లో అర్ధరాత్రి వేళ తాగునీరు రావడంతో నిద్రలేక జాగారం చేస్తున్నామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. మూడో వార్డులోని హన్మమ్మ చర్చి వీధిలో ఆవులన్నీ రోడ్లపై ఉండడంతో రాకపోకలకు అడ్డుగా ఉన్నాయి. దోమలకు నిలయంగా ఉన్నాయి. నాల్గో వార్డులోని వైఎంఆర్ కాలనీ పార్కువీధి, సుబ్బయ్యబట్టీవీధి, సత్యనారాయణ దేవాలయం వీధుల్లో కాలువలు పూడికతో నిండాయి. ఐదో వార్డులో వీవర్స్ కాలనీ రోడ్డు, భవానీనగర్‌లోని వీధులు గుంతలమయంగా మారాయి. ఆరో వార్డు డ్రైవర్‌కొట్టాలలో తెల్లవారుజామున నీటి విడుదల ఇబ్బందికరంగా ఉంది. ఏడు, ఎనిమిది వార్డుల్లోని సంజీవయ్యనగర్, కోఆపరేటివ్ కాలనీ, స్వరాజ్యనగర్, శ్రీనివాసనగర్ బైపాస్‌రోడ్డులో పూడికలు తీయడం లేదనే ఆరోపణలున్నాయి. 9 నుంచి 14 వార్డుల్లోని ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయమై కమిషనర్ వి.మల్లికార్జునను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కాలువల్లో సకాలంలో పూడికతీత చేపట్టేలా ఆప్రాంత సచివాలయ వార్డు పారిశుద్ధ్య కార్యదర్శులకు సూచనలు జారీ చేశామన్నారు. తాగునీటి తదితర సమస్యలు ఉంటే తన దృష్టి తీసుకురావాలని కోరారు.

కాలువలు నిర్మించాలి



మా ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. కాలువలు లేకపోవడంతో గుంతలు తవ్వుకున్నాం. వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం.
- లింగమయ్య, గోకుల్‌నగర్

తాగునీరు సరఫరా చేయాలి



తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల వరకు నీళ్లు వస్తాయి. నిద్రలేవకపోతే నీరు ఉండవు. గతంలో 5 నుంచి 7 గంటల వరకు నీళ్లు వదిలేవారు. ఆ సమయంలోనే కూలి పనులకు వెళ్లే వారికి అనుకూలంగా ఉంటుంది.
- మాబున్నీ, వెంకటలక్ష్మి డ్రైవర్‌కొట్టాలు

రోడ్డు నిర్మించలేదు



మా ప్రాంతంలో రోడ్డు నిర్మించలేదు. మట్టిరోడ్డు కూడా సరిగాలేదు. కాలిబాటే దిక్కు. సచివాలయంలో ఫిర్యాదు చేశాం. గత ప్రభుత్వ పాలనలో కొందరు రాజకీయంగా మా ప్రాంతానికి రోడ్డు నిర్మించకుండా అడ్డుకున్నారు - నరసింహారెడ్డి, బొల్లవరం

పశుగణన సర్వేకు సహకరించాలి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ పశు గణన సర్వే కోసం ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లు పూర్తి స్థాయిలో వివరాలను నమోదు చేసేందుకు సహకరించాలని ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ విభాగం సీఈవో శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని రాధానగర్, కామనూరులో స్థానికుల నుంచి పశు గణన సర్వే సంబంధించి గోడ పత్రాలను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 25 వరకు కొనసాగనున్న ఈ సర్వే ఆధారంగా భవిష్యతులో పశుసంవర్ధకశాఖ, పశువుల అభివృద్ధి కోసం నిధులు, పథకాలు, ప్రణాళికలకు రూపకల్పన ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశువుల అభివృద్ధి, బలోపేతం కోసం కార్యాచరణ అమలు, నిధుల కేటాయింపునకు దోహదపడుతుందన్నారు. డీఎల్‌డీఏ రమేష్ బాబు, జేడీ శారద, డీడీ వీరబ్రహ్మం, ప్రొద్దుటూరు, మైదుకూరు ఏడీఏలు ధనుంజయరెడ్డి, వేంకటేశ్వర్లు, మండల పశువైద్యురాలు సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు భవనాల మంజూరు

చాపాడు, రాజుపాళెం, న్యూస్‌టుడే: చాపాడులోని కస్తూర్బాగాంధీ, రాజుపాళెం మండలం వెల్లాల గురుకుల బాలికల పాఠశాలలకు ప్రధానమంత్రి నిధుల కింద నూతన భవనాలు మంజూరయ్యాయి. చాపాడులో సైన్సు ల్యాబ్, కంప్యూటర్, గ్రంథాలయానికి అదనపు గదుల నిర్మాణానికి రూ.42 లక్షలు మంజూరైనట్లు సమగ్రశిక్షా అభియాన్ ఇంజినీరు నాగప్రసాద్ తెలిపారు. ఈ గదులన్నీ పైఅంతస్తులో నిర్మిస్తామన్నారు. వెల్లాలలో సైన్సు ల్యాబ్ కోసం రూ.19 లక్షలు, క్రీడా మైదానం అభివృద్ధికి రూ.5 లక్షలు వచ్చాయన్నారు. వారం రోజుల్లో నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఇంజినీరు వివరించారు.



చాపాడు కస్తూర్బా పాఠశాల

మురుగునీటి ప్రవాహాన్ని అడ్డుకోవాలి

ప్రొద్దుటూరు పట్టణం: స్థానిక ఈశ్వర్ రెడ్డినగర్‌లో రామాలయంవీధిలో ఇంట్లోని మురుగునీరంతా రోడ్డుపై ప్రవహిస్తోందని ఆ ప్రాంతవాసులు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రనాథరెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. మురుగునీటితో పాటు వర్షపునీరు కలిసి ప్రవహించడంతో స్థానికులు జ్వరాల బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా స్పీడ్‌బ్రేకర్ వేయడంతో ఈ నీరంతా నిల్వతో కుంటగా మారిందన్నారు. ఈ స్పీడ్‌బ్రేకర్‌ను తొలగించాలని కార్యదర్శిని కోరారు.

ముగిసిన జాతీయ పశువైద్య సదస్సు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య కళాశాలలో ఈ నెల 23 నుంచి ప్రారంభమైన జాతీయ పశువైద్య సదస్సు శుక్రవారం ముగిసింది. మూడు రోజుల వరకు నిర్వహించిన కార్యక్రమాల్లో 16 లీడ్ ప్రతాలు, 181 పరిశోధన పత్రాలను దేశ, విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు సమర్పించారు. ఈ నేపథ్యంలో పశువుల పునరుత్పత్తిలో సాధారణ సమస్యలు, సమీకృత దాణా తక్కువ ఖర్చుతో తయారీ, తదితర అంశాలను సదస్సులో విశదీకరించారు. ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాలకు ఏర్పాటు చేసిన తారు రోడ్డు దెబ్బతినడంతో మరమ్మతులను చేపడతామన్నారు. విద్యార్థులకు ఆడిటోరియం ఏర్పాటు చేస్తామని తెలిపారు. పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ శ్రీలత, ఏపీఎల్డీఏ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, ఎస్వీఎస్‌బీటీ అధ్యక్షుడు ఏజే ధామి, తదితరులను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస ప్రసాదు, నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ రాజ కిశోర్ సన్మానం చేశారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు పోటీలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎస్ఆర్ఐటీలో ఎంబీఏ విద్యార్థులకు మేనేజ్‌మెంట్ ఫెస్ట్- 2కే24 కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నాయకత్వ సామర్థ్యం, మానవ వనరులు, వ్యాపార దృక్పథం, ప్రణాళిక, బిజినెస్ క్విజ్ విభాగాల్లో పోటీలను నిర్వహించామన్నారు. వైవీయూలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.సరిత పర్యవేక్షణలో విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేసినట్లు తెలిపారు.



విజేతకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న వైవీయూ ప్రొఫెసర్ సరిత, పక్కన ఎస్ఆర్ఐటీ హెచ్‌వోడీ షబానా

సమస్యల పరిశీలన

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక పవర్‌హౌస్‌వీధిలోని విద్యుత్తు ఈఈ కార్యాలయం, ఉప కేంద్రం లోతట్టులో ఉన్నందున వర్షాలు రాకతో నిలుస్తున్న నీటి మడుగులతో వినియోగదారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీడీసీఎల్ సీఎండీ విభాగం (తిరుపతి)లోని సివిల్ కన్‌స్ట్రక్షన్ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. చాన్నాళ్ల నుంచి జఠిలంగా ఉన్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఈఈ రమణారెడ్డి కోరారు. కొత్తగా నిర్మించిన ఈఆర్వో కార్యాలయ ఆవరణంలో రెండు సంపులను నిర్మించి వర్షపు నీటిని పంపింగ్ చేసేలా ప్రతిపాదన పంపాలని ఏఈ శివప్రసాదును ఎస్ఈ ఆదేశించారు. అమృతానగర్, ఐడీఏ, వెల్లాల, రంగసాయిపురంలోని ఉప కేంద్రాల ప్రహరీ దెబ్బతినడంతో మరమ్మతులు చేయాలని ఈఈ తెలిపారు. ఎర్రగుంట్ల ఏడీఏ కార్యాలయంలో కాలంచెల్లిన గదులు, ఈఆర్వో కట్టడాలను తొలగించి ఆధునిక కార్యాలయం ఏర్పాటు కోసం ప్రతిపాదన ఇవ్వాలని ఏఈకి ఎస్ఈ చెప్పారు. జిల్లా ఎస్ఈ నుంచి తిరుపతి సీఎండీ వద్దకు ఆయా ప్రతిపాదనలు వెళ్లిన తర్వాత పరిశీలించి ఆమోదం మంజూరు చేస్తారని ఈఈ రమణారెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రబీలో రైతులకు బీమా ధీమా

న్యూస్‌టుడే, కడప వ్యవసాయం

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు బీమా ఉంటే రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో రబీ కాలానికి బీమా కింద ప్రభుత్వం పంటలను ఎంపిక చేసింది. జిల్లాలో 2024-25 ఏడాదిలో మొత్తం 1,42,812 హెక్టార్లలో రబీ పంటలు సాగు చేస్తారని రాష్ట్ర గణాంక విభాగం ప్రకటించింది.

డిసెంబరు వరకు ప్రీమియం గడువు

రెండేళ్లకు ఒకేసారి...

ఈసారి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లకు ఒకేసారి బీమా కింద పంటలను ప్రకటించింది. ఆలస్య ఖరీఫ్, ముందస్తు రబీ కింద శనగ సాగుచేస్తారు. దీంతో రబీకి ప్రకటించిన సాధారణ విస్తీర్ణంలో సగానికి మించి ఇదే ఉంది. దీంతో పాటు వరి, జొన్న, మినుము, వేరుసెనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలను కూడా ఎంపిక చేశారు. 2024-25, 2025-26 సంవత్సరాలకు ఆయా సమయాల్లో రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

పంటల వారీగా ఇలా..

పంట	ప్రీమియం (హెక్టారుకు)
శనగ	1,200
వరి	1,575
జొన్న	787.50
పెసర	675
మినుము	712.50
వేరుసెనగ	1,200
నువ్వులు	450
పొద్దుతిరుగుడు	750

మూడు రకాల యూనిట్లు...

ప్రభుత్వం పంట బీమా కింద ప్రకటించిన పంటలు మూడు రకాల యూనిట్లుగా విభజించారు. శనగను గ్రామ యూనిట్ కింద ప్రకటించగా, వరి, జొన్న, మినుము, వేరుసెనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు మండల యూనిట్ కింద ఉన్నాయి. జిల్లా యూనిట్ కింద కేవలం పెసర మాత్రమే ఉంది.

ఈ-పంట నమోదు తప్పనిసరి...

ఈ పంటలకు ప్రీమియం మొత్తం రైతులే చెల్లించాలి. బ్యాంకులో రుణం తీసుకున్న రైతులకు బ్యాంకులే దానిని రుణంలోనే మినహాయించుకుంటారు. రుణం తీసుకోని వారు మీ సేవ కేంద్రాల్లో, తమ ఖాతాలున్న బ్యాంకుల్లో చెల్లించాల్సి ఉంటుంది. వరి పంటకు ఈ ఏడాది డిసెంబరు 15 లోపు, మిగిలిన పంటలకు డిసెంబరు 31 లోపు చెల్లించాలి. బీమా వర్తించాలంటే రైతులు ఈ-పంట కింద తప్పనిసరిగా రైతులు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.


సాగులో శనగ పంట (పాత చిత్రం)

రైతులే చెల్లించాలి

రబీ పంటల బీమాకు ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని జిల్లా బాధ్య పాలనాధికారి అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించి ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఇఫ్కోటోకియో బీమా సంస్థలను ఎంపిక చేశారని చెప్పారు. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకుల్లోనూ, తీసుకోని రైతులు కామన్‌సర్వీస్ సెంటర్ల ద్వారా ప్రీమియం చెల్లించాలని సూచించారు. రైతులు తమ ఆధార్ బ్యాంకు పాసుపుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో అనుసంధానమైన సెల్ నెంబరు వివరాలను జత చేయాలని సూచించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ద్విచక్రవాహనాలను ఢీకొన్న కారు

- ఇద్దరు దుర్మరణం


మన్సూర్, చిన్నసిద్దారెడ్డి (పాత చిత్రాలు)

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సీకే దిన్నె మండల పరిధిలోని ఊటుకూరు వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనాలను కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు ద్విచక్రవాహనాదారులు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. కడప నుంచి రాయచోటికి వెళుతున్న కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాలపై వెళుతున్న ఊటుకూరుకు చెందిన పొన్నోలు చిన్న సిద్దారెడ్డి, మన్సూర్‌లను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. చిన్న సిద్ధారెడ్డిని (52), మన్సూర్ (19) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి గురువారం బుగ్గవంక జలాశయంలోకి ఈతకు వెళ్లిన ప్రేమ్‌కుమార్ అనే విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పాత కడపకు చెందిన ప్రేమ్‌కుమార్ (18) కడప నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం తన నలుగురు స్నేహితులతో కలిసి బుగ్గవంక జలాశయం వద్దకు వెళ్లాడు. ఈత రాకపోయిన జలాశయంలోకి దిగి మునిగిపోయాడు. ప్రేమ్‌కుమార్ నీటిలో గల్లంతవడంతో స్నేహితులు ఇంటికి వెళ్లి విషయాన్ని అతడి కుటుంబ సభ్యులకు తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామీణ సీఐ శంకర్‌నాయక్ అగ్నిమాపక అధికారులు, సిబ్బంది వెళ్లి జలాశయంలో గాలింపు చర్యలు చేపట్టి విద్యార్థి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిమ్స్‌లో గర్భిణి మృతి... బంధువుల ఆందోళన

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: రిమ్స్‌లో కాన్పు నిమిత్తం వచ్చిన గర్భిణి మృతిచెందడంతో వారి బంధువులు ఆందోళన తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని వారు ఆరోపించారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం... నంద్యాల జిల్లా చాగలమర్రి తండాకు చెందిన శ్యామలా బాయికి నెలలు నిండటంతో 23న రిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు ఇది రెండో కాన్పు. పరిశీలించిన వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. ఆమెకు ఫిట్స్ వచ్చి, ఉమ్మనీరు గుండెను తాకడంతో మృతి చెందిందని శుక్రవారం కుటుంబసభ్యులకు చెప్పారు. వెంటనే శస్త్రచికిత్స చేసుంటే బతికేది, వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డ ఇద్దరూ చనిపోయారని కుటుంబసభ్యులు వాపోయారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణి ఉన్నట్లుండి ఫిట్స్ వచ్చాయని, ఆ సమయంలో వైద్యం పూర్తి స్థాయిలో అందించినా ఆమె కోలుకోలేకపోయిందన్నారు. వైద్యులు ఎంత శ్రమించారో వారి బంధువులకు కూడా తెలుసని చెప్పారు. ఈ ఘటనపై ప్రత్యేక కమిటీ వేసి విచారణ చేస్తామని, వైద్యుల వైపు నుంచి తప్పుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాలికపై అత్యాచారం... పోక్సో కేసు

కంబీపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : బాలికపై అత్యాచారం చేసిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కంబీపాడు ఎస్సై సందీప్ అందజేసిన వివరాల మేరకు... జిల్లాలోని ఓ కాలనీకి చెందిన బాలిక, కడపకు చెందిన బాలుడు ఇద్దరు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఈ క్రమంలో బాలికను ప్రేమ పేరుతో వంచించి అత్యాచారం చేశాడు. ఈ విషయం బాలిక తండ్రికి తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా... కేసు నమోదు చేశారు.

ఎర్రచందనం స్వాధీనం... ఇద్దరి అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అటవీ అధికారులు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం రేంజిలో శుక్రవారం అటవీ అధికారులు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు తమిళ కూలీలను అదుపులోకి తీసుకున్నారు. సిద్దవటం అటవీక్షేత్రాధికారి కళావతి మాట్లాడుతూ మద్దూరు బీటులోని నీలసరకోన అటవీ ప్రాంతంలో సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా, కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు తరలించేందుకు ప్రయత్నం చేశారన్నారు. తమిళనాడులోని సేలం జిల్లా, నరసమ్మ గ్రామానికి చెందిన రంగస్వామి, భూపాలన్ అనే కూలీలు పట్టుబడగా, మరికొందరు పరారయ్యారని చెప్పారు. ఘటనా స్థలంలో 23 ఎర్రచందనం దుంగలు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులను విచారించగా చాపాడు మండలం ఖాదర్‌పల్లి గ్రామానికి చెందిన జాకీర్ అనే వ్యక్తి తమను ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రోత్సహించినట్లు చెప్పారని వెల్లడించారు. వారిని తిరుపతిలోని న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు. కొండూరు సెక్షన్ అధికారి సురేష్, బీటు అధికారులు దీపక్, విశ్వనాథ్‌రెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా టపాసులు విక్రయిస్తే కేసులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా అనుమతులు లేకుండా ఎవరైనా టపాసులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సూచించిన ప్రదేశాల్లోనే నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లు వేసి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీళ్లు, ఇసుక, తదితర అగ్నిప్రమాద నిరోధక సామగ్రిని తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. అక్రమంగా విక్రయం చేసే వారిపై డయల్ 100 సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వెలిగల్లులో పెరిగిన నీటి నిల్వలు

గాలివీడు: వెలిగల్లు జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో ఉన్న జలాశయాల్లో సమృద్ధిగా నీటి నిల్వలు పెరగడంతో దిగువన పాపాఘ్ని నది ప్రవహిస్తోంది. జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా శుక్రవారం 2.66 టీఎంసీల నీటి మట్టం పెరిగింది. జలాశయం నుంచి గాలివీడు, రాయచోటి రక్షిత నీటి పథకాలకు ఆరు క్యూసెక్కులు, సాగునీటి ఎడమ కాలువకు రెండు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో పది రోజులు కిందట 2.32 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా తుపాను ప్రభావంతో పడిన వర్షాలకు 0.34 టీఎంసీల నీరు అదనంగా చేరింది. నీటి నిల్వను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని జలాశయ డీఈఈ భాస్కర్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కడపలో ముమ్మరంగా తనిఖీలు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా నార్కోటిక్ కంట్రోల్ విభాగం(డీఎన్‌సీసీ) వారు శుక్రవారం నగరంలోని ట్రాన్స్‌పోర్టు, కొరియర్ కార్యాలయాలు, గోదాంల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. వివిధ రూపాల్లో గంజాయి దిగుమతి అవుతున్న దృష్ట్యా వీటిని చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో పూర్తిస్థాయిలో గంజాయి నిర్మూలనకు కృషి చేస్తున్నామని తెలిపారు. పార్శిళ్లలో ఎక్కడైన గంజాయి ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డీఎన్‌సీసీ అధికారులు, పోలీసులున్నారు.


గోదాంలో తనిఖీలు చేస్తున్న డీఎన్‌సీసీ సిబ్బంది

ప్రత్యేక హోదాకు పోరాడాలి

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు ధ్రువకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మాజీసీఎం జగన్ తన స్వార్థప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి విభజన హామీలను తుంగలో తొక్కారన్నారు.

పశుగణన ప్రారంభం

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో శుక్రవారం పశుగణన ప్రారంభమైంది. తొలిరోజు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ, డీడీలు ఏడీలు పశువైద్యులు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా బాధ్య పాలనాధికారి అదితి సింగ్, ఎమ్మెల్యే మాధవిరెడ్డి నివాసాలకు వెళ్లి గణన ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 236 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. జిల్లాలో ప్రస్తుతం ఆవులు, ఎద్దులు 44,656, గేదెలు, దున్నలు 3,99,910, గొర్రెలు 9,83,684, మేకలు 3,62,582, కోళ్లు 10,95,152, పందులు 2,777, ఇతర జంతువులు ఉన్నాయని అంచనా. మొదటి రోజు గణనకు సంబంధించి యాప్ ఓపెన్ కాలేదు. దీంతో వివరాలను మ్యాన్యువల్‌గా రాసుకొచ్చారు. శుక్రవారం రాత్రి నుంచి యాప్ పనిచేస్తుందని అధికారులు తెలిపారు. గణనపై సీఈఓ శ్రీనివాసరావు ఊటుకూరు డీడీ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.


ఎర్రగుంట్లలో పశువుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

మద్యం తాగి... బస్సుపై పడుకుని...

వేంపల్లె, న్యూస్‌టుడే : మద్యం మత్తులో ఓ వ్యక్తి శుక్రవారం ఉదయం వేంపల్లె నుంచి రాయచోటికి వెళ్లే పల్లెవెలుగు బస్సు టాపు పైకి ఎక్కి నిద్రపోయాడు. ఈ విషయం ఎవరూ గమనించకపోవడంతో బస్సు బయలుదేరింది. చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లె వద్దకు వెళ్లేసరికి పైన పడుకున్న వ్యక్తి టాపు చివరకు వచ్చి పడిపోయేలా ఉండడంతో అక్కడి స్థానికులు గుర్తించి కేకలు వేశారు. దీంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేశారు. కండక్టర్ బస్సుపైకి వెళ్లి అతడిని కిందకు దింపారు.


బస్సు నిలిపివేసి, వ్యక్తిని లేపుతున్న కండక్టర్

ప్రైవేట్ పాఠశాలల విద్యాసదస్సు రేపు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు జరుగుతుందని అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్‌ఎయిడెడ్ పాఠశాలల సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని కరస్పాండెంట్లు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వైవీయూలో పికాసో చిత్రాలపై కార్యశాల

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: వైవీయూ లలిత కళ విభాగం ఆధ్వర్యంలో ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రాల సరళిపై శుక్రవారం ఒక రోజు కార్యశాల నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో పికాసో చిత్రకళా సౌరభాన్ని తెలుసుకోవడంతో పాటు, డాక్యుమెంటరీ ప్రదర్శించారు. అనంతరం గతంలో పికాసో గీసిన చిత్రాన్ని విద్యార్థులు అప్పటికప్పుడు వేసి ఆకట్టుకున్నారు. బాధ్య వీసీ పుత్త పద్మ మాట్లాడుతూ ప్రపంచ చిత్రకళా విభాగంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించిన పికాసో చిరస్మరణీయుడన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, ఆర్ట్స్ విభాగం డీన్ కంకణాల గంగయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిత్రంతో వైవీయూ రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

స్థానిక అవసరాలకే ఉచిత ఇసుక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానం స్థానిక అవసరాల కోసం మాత్రమేనని జిల్లా బాధ్య కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. శుక్రవారం అమరావతి నుంచి గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్‌మీనా జిల్లా అధికారులతో దృశ్యమాధ్యమంలో సమీక్ష చేపట్టి పలు సూచనలిచ్చారు. అనంతరం బాధ్య కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రాంతాల్లో లభ్యమయ్యే ఇసుకను ఎద్దులబండ్లు, ట్రాక్టర్లలతో ఉచితంగా రవాణా చేసుకోవచ్చన్నారు. వాణిజ్య అవసరాల కోసం ఉపయోగిస్తే ట్రాక్టర్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గనులశాఖ డీడీ సూర్యచంద్రరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమీక్షలో పాల్గొన్న బాధ్య కలెక్టర్ అదితిసింగ్

ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో ర్యాగింగ్‌కు ఎంత మాత్రం స్థానం లేదని, దాని జోలికెళితే భవిష్యత్తు నాశనమవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. స్థానిక వైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం యాంటీ ర్యాగింగ్ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల దుష్ఫలితాలు, విధించే శిక్షలను వివరించారు. కళాశాలలో సీనియర్లు, జూనియర్లు కలసిమెలసి ఉండాలని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్, హాస్టల్ వార్డెన్ డాక్టర్ సునీల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి బాబాఫకృద్దీన్

ఔషధ దుకాణాల్లో తనిఖీలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: మెడికల్ షాపుల యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి అన్నారు. నగరంలోని పలు దుకాణాల్లో శుక్రవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. మత్తు కలిగించే మందుల అమ్మకాల రికార్డులను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన రెండు దుకాణాలపై నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నామని తెలిపారు. రాయచోటి డ్రగ్స్ అధికారి జయరాముడు, పోలీసులు పాల్గొన్నారు.


మందుల షాపులో తనిఖీ నిర్వహిస్తున్న కడప డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి

జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకం


సువర్ణను అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త

వేంపల్లె, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని బెంగళూరు సువర్ణ కాంస్యపతకం సాధించింది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన ఆమె ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 14 నుంచి 18 వరకు గోవాలో జరిగిన పోటీల్లో ఆమె ప్రతిభ చాటి పతకం గెలుచుకుంది. విద్యార్థినిని డైరెక్టర్ కుమారస్వామిగుప్త, ట్రిపుల్‌ఐటీ ఎస్టాబ్లిష్‌మెంట్ బాధ్యుడు సుధాకర్‌రెడ్డి, పీడీ బాల ఓబయ్య, ఏపీ పవర్‌లిఫ్టింగ్ జట్టు కోచ్ బాలగోవింద్ తివారీ అభినందించారు.

అన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కడపకు చెందిన గజ్జల దినేష్‌రెడ్డి రూ.5 లక్షల మొత్తాన్ని ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు శుక్రవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు.


విరాళం అందిస్తున్న దినేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

పంచాయతీల అభివృద్ధి కీలకం

శ్రీకాళహస్తి: దేశాభివృద్ధిలో పంచాయతీల అభ్యున్నతి కీలకమని శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) ప్రిన్సిపల్ నాగపద్మజ అన్నారు. పట్టణంలోని ఈటీసీ కేంద్రం ఆవరణలో శుక్రవారం చిత్తూరు, కడప ఉమ్మడి జిల్లాలకు సంబంధించి సీఈవో, డీపీవో, ఎంపీడీవోలకు శిక్షణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏపీఎస్ఐఆర్‌డీ రమేష్, కడప సీఈవో ఓబులమ్మ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పొలతలలో కార్తిక ఉత్సవాలకు ఏర్పాట్లు


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : కార్తిక మాస ఉత్సవాల సందర్భంగా పొలతల శైవక్షేత్రంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ కార్యనిర్వాహాధికారి కృష్ణానాయక్ పేర్కొన్నారు. పొలతలలోని పర్యాటక భవనంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తహసీల్దారు అనురాధ, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, గ్రామీణ సీఐ చల్లనిదొర, తదితరులు పాల్గొన్నారు. తెదేపా మండల నాయకుడు ఎస్.రాజారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11లోగా పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : పదోతరగతి పరీక్ష ఫీజును నవంబరు 11వ తేదీ లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబరు 18 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో 25వ తేదీ వరకూ, రూ.500 ఆలస్య రుసుముతో నవంబరు 30 వరకు గడువు ఉందని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి విద్యార్థుల ఫీజు కట్టాలని లేకుంటే ఎట్టిపరిస్థితుల్లో పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయండి

వేంపల్లె, న్యూస్‌టుడే: గ్రామాల్లో గర్భిణుల వివరాల నమోదు ప్రక్రియ నూరుశాతం చేయాలని జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ యూనిట్ అధికారి నాగశశిభూషణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని తాళ్లపల్లె ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైద్యులు స్వాతీసాయి, లక్ష్మీప్రియ, హెచ్ఈ షఫీఉన్నీసాబేగం, సీహెచ్‌వోలు వెంకటరత్నం, బసయ్య, ఫకృద్దీన్, సూపర్‌వైజర్ అరుణాదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి నాగశశిభూషణ్‌రెడ్డి

కేజీబీవీ బాలికలు... క్రీడల్లో విజేతలు

– న్యూస్‌టుడే, అట్లూరు

జాతీయస్థాయి పోటీల్లో సత్తా

గ్రామీణ ప్రాంత విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. చదువులతో పాటు ఆటల్లోనూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. అట్లూరు కస్తూర్బా విద్యార్థినులు క్రీడల్లో ప్రత్యర్థులపై తడాఖా చూపుతున్నారు. పోటీల్లో సత్తాచాటుతున్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ ప్రశంసలు పొందుతున్నారు. 270 మంది విద్యార్థులకు వంద మందికి పైగా క్రీడా పోటీలకు సై అంటున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల, ప్రిన్సిపల్ ఫణిశ్రీ ప్రోత్సాహంతో విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తున్నారు.


విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ ఫణిశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల

ఎస్పీ కావాలన్నదే లక్ష్యం



సొంతూరు గంగనపల్లి, మా నాన్న రైతు. టెట్ బాల్ క్రికెట్‌లో జాతీయ స్థాయిలో ఎంపికయ్యాను. రాష్ట్ర స్థాయిలో నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, కుస్తీ, జూడో, టెన్నిస్, కురాస్ క్రీడల్లో రాణించాను. ఎస్పీ కావాలన్నదే నా లక్ష్యం. చెన్నైలో మరిన్ని జట్లతో ఆడబోతున్నాం.

– ఎస్.మస్తాన్‌బీ, ఇంటర్

మహిళ క్రికెట్ జట్టులో చోటు సాధిస్తా



సోమశిల ముంపులో ఎగువపల్లె మా ఊరు. పునరావాసంలో అట్లూరు క్రాస్‌రోడ్డులో ఉంటున్నాం. ఇటీవల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రాణించాను, జాతీయ స్థాయిలోను ఆడేందుకు వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల అవకాశం కల్పిస్తున్నారు. ఇండియా మహిళా క్రికెట్ జట్టులో ఆడాలన్నదే లక్ష్యం. సెపక్‌తక్రా, కురాస్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణించాను.

– వై.సుప్రియ, ఇంటర్

అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని...



కస్తూరిబాలో ఇంటర్ చదువుతున్నాను, ఇటీవల టెన్నిస్ బాల్ క్రికెట్‌లో మా జట్టు జాతీయ స్థాయిలో విజయం సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం. సాఫ్ట్‌బాల్, సెపక్‌తక్రా, బేస్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు కావాలన్నదే లక్ష్యం. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన క్రీడలు ఆడించాలన్నదే కోరిక.

– బి.లక్ష్మీప్రసన్న, ఇంటర్

కడప

• కడప • పులివెందుల • కమలాపురం


రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేసిన కేవీకే శాస్త్రవేత్తలు

రైతులకు శనగ విత్తనాల పంపిణీ

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రైతులకు శాస్త్రవేత్తలు శనగ విత్తనాలు, విత్తనశుద్ధి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేవీకే సమన్వయకర్త వీరయ్య మాట్లాడుతూ బయోటెక్ కిసాన్ హబ్ పథకంలో భాగంగా రైతులకు శనగలో ఎస్‌బీజీ-776 రకం విత్తనను అందించామన్నారు. ఇందులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. శాస్త్రవేత్తలు సాయిమహేశ్వరి, మహేష్ పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన మూడో ఏడాది బీఎస్సీ విద్యార్థిని బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటింది. ఈ నెల 24న బద్వేలులో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటి ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైందని పీడీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఆమెను అభినందించారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, పీడీ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

● మాధవరం-1 పరిధిలోని అలీనగర్‌లో పైపులైను లీకేజీతో మంచినీరు వృథాగా పోతుందని 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. దీనిపై గ్రామ కార్యదర్శి లక్ష్మీనరసయ్య స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టారు. **- న్యూస్‌టుడే, సిద్దవటం**

● కమలాపురం నగర పంచాయతీ పరిధిలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని 'ఈనాడు'లో ప్రచురరితమైన కథనానికి నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి పలు ప్రాంతాల్లో కాలువలను శుభ్రం చేయించారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. **- న్యూస్‌టుడే, కమలాపురం**

పాత కడప... అభివృద్ధి పడక!



పాతకడప వద్ద తగ్గిపోయిన చెరువు కట్ట విస్తీర్ణం


సాయిపేట సమీపంలో ఇదీ పరిస్థితి

- న్యూస్‌టుడే, దేవుని కడప

నగరంలో అంతర్భాగమైన పాతకడప దశాబ్దాలుగా అభివృద్ధికి దూరమైంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి చెరువును ట్యాంక్‌బండ్ తరహాలో తీర్చిదిద్దుతామని కడప నగర పాలకులు చెప్పారు. రోజులు.. నెలలు.. సంవత్సరాలు గడిచిపోయాయి తప్ప ఆ మాట మాత్రం నీటిమూటగానే మిగిలిపోయింది. కనీసం చెరువు కట్ట అభివృద్ధికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. కడప నగరం శ్రీకృష్ణదేవరాయకూడలి నుంచి దేవుని కడప, పాతకడప మీదుగా బైపాస్ వరకూ రోడ్డు సౌకర్యం ఉంది. మరోవైపు చిలకల బావి నుంచి సాయిపేట, పాలంపల్లె, రూకవారిపల్లె మీదుగా బైపాస్ ఉంది. మొత్తం ఈ ప్రాంతాలన్నింటినీ కలుపుతూ రవాణాకు అనువుగా ఉండాలంటే చెరువు కట్ట అభివృద్ధి చేపట్టాలి. కట్ట విస్తీర్ణం పరిశీలించి రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. అధికారులు, పాలకులు అటువైపు దృష్టిపెట్టడం లేదు. సాయిపేట సమీపంలో చెరువుకట్ట అధ్వానంగా ఉంది. దట్టమైన కంపచెట్లతో ఇబ్బందికరంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షం వస్తే కట్ట మీద ద్విచక్రవాహనాలకూ అవస్థలు తప్పడం లేదు. సమస్యలను పరిష్కరించి పాతకడపను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చూస్తారు... వెళ్లిపోతారు



పాతకడప చెరువు అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చుచేస్తామని ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నారు. ఒక్కోసారి పనులు చేస్తామని కట్ట వద్దకు అధికారులు వచ్చి చూస్తారు... వెళతారు. ఆ తరువాత ఎటువంటి చర్యలూ ఉండవు. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలి.

- హరినాథరెడ్డి, పాతకడప

ఘనంగా అంధుల ఉన్నత పాఠశాల వజ్రోత్సవం

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో శుక్రవారం వజ్రోత్సవం నిర్వహించారు. పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అతిథులుగా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్న వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎబెనెజర్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టరు అదితిసింగ్

వేడుకగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అలంకరణలో మాతమ్మ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట ఎస్సీ కాలనీలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన మాతమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.

దార్శనికుడు హోమీజే బాబా


నివాళులర్పిస్తున్న యూసీఐఎల్ ఉద్యోగులు

వేముల, న్యూస్‌టుడే: అణుశక్తిరంగానికి డాక్టర్ హోమిజే బాబా మార్గదర్శకుడని యూసీఐఎల్ మిల్లు విభాగానికి చెందిన డీజీఎం సుమన్‌సర్కార్ పేర్కొన్నారు. హోమిజేబాబా జయంతిని పురస్కరించుకుని ఎం.తుమ్మలపల్లె యురేనియం పరిశ్రమ ఆవరణలో శుక్రవారం సాంకేతిక అతిథి ఉపన్యాసం నిర్వహించారు. సంస్థ ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు ముఖ్య అతిథిగా భారత ప్రభుత్వ బ్యూరోఆఫ్ స్టాండర్డ్స్ డైరెక్టర్ భవాని హాజరై మాట్లాడుతూ హోమిజేబాబా ప్రపంచానికి దార్శనికుడని కొనియాడారు. గని విభాగానికి చెందిన కిషోర్‌భగత్, పరిశ్రమ, ఎస్ఎంఎస్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో 8 మందికి గాయాలు

చెన్నూరు : కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్ర సమీపంలో శుక్రవారం ఆటోను ఐషర్ వాహనం ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వల్లూరు మండలం పుష్పగిరికి చెందిన అమరావతి (42), మరో ఇద్దరితో కలిసి రహదారిపై ఆటోలో కూర్చుని ఉండగా చెన్నూరు నుంచి కడప వైపు వెళుతున్న ఐషర్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలోని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

తలుపుల, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయతీ వేమలగొంది కొట్టాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. వైయస్ఆర్ జిల్లా సిద్ధారెడ్డిగారిపల్లికి చెందిన రామాంజనేయులు పనిపై తలుపులకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ఆయన గాయపడ్డారు. మొదట వేంపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. మరో ద్విచక్ర వాహనంలోని గోరంట్లకు చెందిన వ్యక్తికి గాయమైంది.

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప రిమ్స్ ఠాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కడప బుడ్డాయపల్లెకు చెందిన ప్రభాకర్, కొండమ్మలు ద్విచక్రవాహనంపై కడప నగరానికి వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరారు. బుడ్డాయపల్లె క్రాస్ వద్ద వాహనాన్ని మలుపు తిప్పుతుండగా ఎదురుగా మరో వాహనదారుడు వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రభాకర్, కొండమ్మలు గాయపడగా, చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: కొండూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో వరపుత్రుడు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వరపుత్రుడు కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చి గ్యాస్ పొయ్యి వెలిగించారు. పక్కన ఉన్న మరో సిలిండర్ నుంచి గ్యాస్ లీకవడంతో మంటలు చేలరేగాయి. దీంతో వరపుత్రుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. బాధితుడిని నందిమండలం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

వ్యక్తిపై దాడి

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: సింహాద్రిపురం మండలం నంద్యాలంపల్లెలో శుక్రవారం వ్యక్తిపై దాడి జరిగింది. తాను పొలానికి వెళుతుండగా కొంతమంది ఇనుప రాడ్లతో తనపై దాడి చేసినట్లు బాధితుడు వెంకటమహేశ్వర్‌రెడ్డి తెలిపారు. దాడిలో గాయపడిన ఆయన పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సింహాద్రిపురం పోలీసులు తెలిపారు.

సైబర్‌నేరాల అడ్డుకట్టలో యువతదే కీలకపాత్ర

వేంపల్లె, న్యూస్‌టుడే : సైబర్‌నేరాల అడ్డుకట్టలో యువతదే కీలకపాత్ర అని వేంపల్లె ఎస్సై తిరుపాల్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీచైతన్య ఉన్నతపాఠశాలలో సైబర్ నేరాల నివారణలో యువతపాత్ర అనే అంశంపై అవగాహనసదస్సు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గా ఉరుసుకు ఆహ్వానం

కడప, చిన్నచౌకు : ప్రసిద్ధిగాంచిన కడప అమీన్‌పీర్ దర్గా(పెద్ద దర్గా) ఉరుసుకు రావాలంటూ మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషాకు శుక్రవారం దర్గా పీఠాధిపతి ఆరుపుల్లా హుస్సేనీ, నిర్వాహకులు వెళ్లి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

వేముల, న్యూస్‌టుడే: ఉచిత ఆరోగ్యవైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎంఎస్ చీఫ్‌విజిలెన్స్ అధికారి ఖలీల్ సౌధాగర్ పేర్కొన్నారు. కొత్త ఎస్ఎంఎస్ కాలనీలో కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు ఆరోగ్యసేవలను అందించేందుకు రెండురోజులపాటు నిర్వహించే శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు.

ప్రతిభకు పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


విజేతలతో డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరం యర్రముక్కపల్లెలోని బాల వికాస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష జరిగింది. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా సి.లేఖ్య (8వ తరగతి), టి.ప్రదీప్‌కుమార్ (10వ తరగతి), వి.తనీష (9వ తరగతి)లు నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

వ్యాసరచన పోటీల్లో సత్తా


పరీక్షకు హాజరైన విద్యార్థులు


విజేతలతో కరస్పాండెంట్ రాజారెడ్డి, ఛైర్మన్ చంద్రమౌళిరెడ్డి, ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష జరిగింది. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. మొదటి, రెండు, మూడు స్థానాలలో బి.యక్షితరెడ్డి (9వ తరగతి), కె.సరిత (10వ తరగతి), బి.సుప్రియరెడ్డి (8వ తరగతి) నిలిచారు. పాఠశాల విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ రాజారెడ్డి, ఛైర్మన్ చంద్రమౌళిరెడ్డి, ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి లు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.


రక్తదానంతో పలువురికి పునర్జన్మ



రక్తదానం చేస్తున్న యువత

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: ఒకసారి రక్తదానం చేస్తే ముగ్గురు ప్రాణాలను కాపాడినవారవుతారని, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రిమ్స్ బ్లడ్ బ్యాంక్ ఎంవో రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జేబీవీఎస్ సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. సీఆర్ఐ సుబ్బారెడ్డి ట్రస్ట్ వ్యవస్థాపకుడు సునీల్‌జయంత్, జేబీవీఎస్ సేవాసమితి వ్యవస్థాపకుడు సునీల్, ఎన్‌వైకే సిబ్బంది ప్రేమ్‌కుమార్, కళ్యాణి, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజంతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న పవర్ గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హరివెంకటకుమార్

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: అవినీతి రహిత సమాజంతోనే దేశాభివృద్ధి జరుగుతుందని పవర్ గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.హరి వెంకటకుమార్ పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా సీకే దిన్నె మండలం పెద్దకాంపల్లి పవర్ గ్రిడ్ సంస్థకు చెందిన ప్రతినిధులు నగర శివారులోని కేఎస్ఆర్ఎం కళాశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పవర్‌గ్రిడ్ అధికారులు పి.విజయరాజశేఖర్, ఎం.ప్రమోద్, ఎం.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు పారుగు... పారిశుద్ధ్యం కనుమరుగు


పులివెందులలోని పుల్లారెడ్డి ఆసుపత్రి పక్కవీధిలో మురుగు

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల పురపాలిక పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. బాకరాపురం, ఎర్రగుడిపల్లె, కె.వెలమవారిపల్లె తదితర చోట్ల మురుగుకాలువలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్నిప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేకపోవడంతో మురుగునీరంతా బయటకు పారుతోంది. దీంతో దోమలు వృద్ధిచెందుతున్నారు. పందుల సంచారం అధికమై స్థానికులు వ్యాధుల పాలవుతున్నారు. పురపాలక అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొప్పర్తి పారిశ్రామికవాడలో ఉద్యోగాల కల్పనకు కృషి

కమలాపురం, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని బయటకు వెళ్లేలోపు కొప్పర్తి పారిశ్రామికవాడలో వివిధ రకాల పరిశ్రమలను ఏర్పాటు చేయించి, వాటిల్లో ఉద్యోగాలు కల్పించే విధంగా ముందుకెళతానని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన స్కిల్ హబ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రగతి నివేదిక పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ కూడా కొప్పర్తిని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. మేళాలో 20 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.


యువతను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

డ్వాక్రా మహిళలకు మరిన్ని రుణాలందించాలి

కమలాపురం, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళల అభ్యున్నతికి బ్యాంకులు మరిన్ని రుణాలు అందించాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక డీసీసీ బ్యాంకు వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్(స్టాల్స్)ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం డ్వాక్రా మహిళలు తయారు చేసిన పిండివంటలు, వివిధ రకాల ఆహార పదార్థాలు, వస్తువులను పరిశీలించారు. నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్, మెప్మా పట్టణ మిషన్ సమన్వయకర్తలు నాగేంద్ర, లావణ్య, ప్రజోద్‌కుమార్, వెలుగు ఏపీఎం గంగాధర్, నాయకులు ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చర్యలు

వేముల : వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే చర్యలు తప్పవని ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని కొండ్రెడ్డిపల్లెకు చెందిన వజ్రా రవీంద్రారెడ్డిని శుక్రవారం స్టేషన్‌కు పిలిపించి పాత కేసులపై ఆరా తీశారు. సమాజానికి చెడు కలిగించే వార్తలను, వ్యక్తిస్వేచ్ఛకు భంగం కలిగించే పోస్టులను పెట్టొద్దని సూచించారు.

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప, అరవింద్‌నగర్, న్యూస్‌టుడే: కడప నియోజకవర్గంలో 20 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.19,94,591 విలువైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తోందని తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలుస్తున్నారని కొనియాడారు.

కమలాపురం పరిధిలో... : జిల్లా సచివాలయం : కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి, కమలాపురం, వీరపునాయునిపల్లె, సీకేదిన్నె మండలాలకు చెందిన ఏడుగురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.13లక్షల చెక్కులను ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి శుక్రవారం కడపలోని తన కార్యాలయంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ.40లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: పశు గణన పక్కాగా ఉంటేనే భారతదేశ ప్రగతికి మేలు జరుగుతుందని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని ఎమ్మెల్యే నివాసంలో పశుగణన జరిగింది. ఈసందర్భంగా జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ శారదమ్మతో కలిసి ఆమె కిట్‌ను ఆవిష్కరించారు. నోడల్ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, డీడీ డాక్టర్‌రంగస్వామి, ఏడీ డాక్టర్ శ్రీధర్, లింగారెడ్డి, మోహన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు : మాచిరెడ్డిపల్లెలో శుక్రవారం నియోజకవర్గ ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పశుగణన గోడపత్రాన్ని ఆవిష్కరించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా ఉపసంచాలకులు రమణయ్య, కమలాపురం సహాయ సంచాలకులు ఉత్తయ్య, మండల పశువైద్యాధికారులు మారుతిప్రతాప్‌రెడ్డి, శ్రీహరి, పెద్దచెప్పలి వైద్యాధికారి శివజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పశుగణన సర్వే వివరాలను ఖచ్చితంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ డీడీ మంగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సింహాద్రిపురంలో నిర్వహిస్తున్న సర్వేలో ఆయన పాల్గొని సిబ్బందికి సూచనలు చేశారు. ఏడీ శివప్రసాదు, బిదినంచెర్ల పశువైద్యుడు యూనస్ పాల్గొన్నారు.

ఉల్లి పంట దిగుబడులపై ఆరా

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని బాలయ్యగారిపల్లె, గుర్రాల చింతలపల్లె గ్రామాల్లో ఉల్లి సాగు చేసిన రైతులతో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు సమావేశమై పంట దిగుబడులపై ఆరాతీశారు. అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

మాధవరం... సమస్యలతో కలవరం

- న్యూస్‌టుడే, సిద్దవటం

మూడున్నర దశాబ్దాల కిందట సోమశిల జలాశయం ముంపునకు గురైన ఒంటిమిట్ట మండలంలోని మాధవరం-1 గ్రామస్థులు సిద్దవటం మండలంలోని భాకరాపేట-ఒంటిమిట్ట మార్గంలోని జాతీయ రహదారి పక్కన అదే పేరుతో పునరావాసం ఏర్పరచుకున్నారు. ప్రస్తుతం అది మండలంలో అతి పెద్ద జనాభా గల పంచాయతీగా మారింది. ఇక్కడ సమస్యలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఈ పంచాయతీలోని పార్వతీపురం, వెంకటేశ్వరాపురం, మాధవరం-1, అలీనగర్, లక్ష్మీపురం, బంగారుపేట, మరికొన్ని వీధుల్లో నేటికీ మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం వస్తే మొత్తం బురదమయంగా మారుతున్నాయి.


పాత గ్రామ పంచాయతీ భవనం పక్కన నిల్వ ఉన్న చెత్త


మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపైకి చేరిన మురుగు

తాగునీటికి ఇక్కట్లు

సిద్దవటం పెన్నానది నుంచి సరఫరా అయ్యే తాగునీరు రెండు రోజులకు ఒకసారి వదులుతున్నారు. అన్ని వీధులకు సక్రమంగా రాకపోవడంతో స్థానికులు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. మహబూబ్‌నగర్‌లో కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నివాస గృహాల నుంచి వచ్చే మురుగు నేరుగా జాతీయ రహదారి పక్కన ఉండే కాలువలోకి వచ్చి నిలిచిపోతుంది. దీంతో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని దుకాణదారులు, ప్రజలు పేర్కొన్నారు. రెండు నెలల నుంచి పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ చేయకపోవడంతో వీధుల్లో ఎక్కడ వ్యర్థాలు అక్కడే పేరుకుపోయాయి. జగనన్న కాలనీలోకి వెళ్లే రైల్వే కల్వర్టు దారిలో వర్షపునీరు నిలుస్తుండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. శ్మశానానికి సరైన స్థలం లేక చెరువులో అంత్యక్రియలు చేసుకునే దుస్థితి నెలకొందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.